నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్, బుధవారం 12 మార్చి 2025 | ADILABAD NIRMAL



రేషన్ బియ్యం రాక ఖాళీగా ఉన్న గోదాం

# పండుగకు పస్తులేనా?

## 11వ తేదీ దాటినా అందని రేషన్ బియ్యం

- బియ్యం కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులు
- ఖానాపూర్ నియోజకవర్గంలోని 47 షాపులకే సరఫరా
- ఉగాది పండుగ వరకైనా ఇవ్వాలని వేడుకోలు

దస్తురాబాద్, మార్చి 11 : ప్రతినెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ దుకాణాల ద్వారా బియ్యాన్ని సరఫరా చేస్తారు. మార్చి నెలకు సంబంధించిన బియ్యం 11వ తేదీ వరకు కూడా కొన్ని చౌక ధరల దుకాణాలకు రాలేదు. దీంతో లబ్ధిదారులు ఉగాది పండుగ సమీపిస్తుండడంతో బియ్యం వస్తాయో? రావో? అని ఆందోళన చెందుతున్నారు. ఖానాపూర్ ఎంఎల్ఎస్ పాయింట్ పరిధిలో ఐదు మండలాలు ఉన్నాయి. ఇందులో 110 రేషన్ దుకాణాలుండగా 47 దుకాణాలకు బియ్యాన్ని అధికారులు సరఫరా చేశారు. ఇంకా 63 దుకాణాలకు సరఫరా చేయాలి. ఖానాపూర్ మండలంలో 35 రేషన్ దుకాణాలు ఉండగా.. 226.043 టన్నుల బియ్యం సరఫరా చేయాలి. కానీ.. 25 రేషన్ దుకాణాలకు 200.464 టన్నుల బియ్యాన్ని సరఫరా చేశారు. మమడ మండలంలో 25 దుకాణాలు ఉండగా.. 180.039 టన్నుల రేషన్ బియ్యం సరఫరా చేయాలి. ఆరు దుకాణాలకు 30.00 టన్నుల బియ్యం వచ్చాయి. పెంబి మండలంలో 13 దుకాణాలు ఉండడా.. 720.05 టన్నుల బియ్యం సరఫరా చేయాలి. నాలుగు దుకాణాలకు 150.34 టన్నుల రేషన్ బియ్యం సరఫరా చేశారు. కడెం మండలంలో 26 దుకాణాలు ఉండగా 182.926 టన్నుల బియ్యం సరఫరా చేయాలి. తొమ్మిది దుకాణాలకు 57.293 టన్నుల బియ్యం వచ్చాయి. దస్తురాబాద్ మండలంలో 11 దుకాణాలు ఉండగా.. 82.454 టన్నుల రేషన్ బియ్యం సరఫరా చేయాలి. మూడు దుకాణాలకు 16.00 టన్నుల బియ్యం సరఫరా చేశారు. ఈ విషయమై సివిల్ సప్లయ్ డీటీ రాకేశ్‌ని వివరణ కోరగా 23 లారీలు రావాల్సింది ఉండగా ఆరు లారీలు మాత్రమే వచ్చాయని తెలిపాడు. వచ్చిన రేషన్ బియ్యాన్ని వచ్చినట్టు సరఫరా చేస్తున్నామని తెలిపాడు.

జైపూర్ మండలం ఇందారం గ్రామంలో నీరు లేక ఎండిపోతున్న పంటలు



# అడుగంటిన జలాలు ఎండుతున్న పంటలు

## కాంగ్రెస్ తెచ్చిన కరువు

- రామారావుపేట పెద్ద చెరువులో అడుగంటిన నీరు
- బోరు బావుల్లో పాతాళానికి చేరిన నీటి మట్టం
- సరిపడా నీరందక ఎండిపోతున్న పంటలు

### జైపూర్ మండలంలోని ఇందారం, టేకుమట్ల గ్రామాల్లో దయనీయ స్థితి

### ఐదు రోజులుగా నీళ్లు లేవ్..

నా పేరు బల్ల రాజు. బోర్ల కింద దాదాపు 25 ఎకరాలు సాగు చేసిన. బోర్లలో నీరు లేక పంట ఎండిపోతున్నది. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో ఐదు రోజులుగా ఉన్న కొద్దిపాటి నీళ్లను కూడా పొలానికి పెట్టడం కుదరడం లేదు. నేను కరంటోళ్ల చుట్టూ తిరుగుతుంటే పొలం ఉల్లారే దశకు వచ్చింది. దాదాపు ఎకరం పొలం ఇప్పటికే ఎండిపోయింది. మా చుట్టు పక్కన పొలాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకున్నది. సర్కారు స్పందించి రైతులకు న్యాయం చేయాలి. పంటలకు సాగునీరు అందేలా చేయాలి.

*- బల్ల రాజు, రైతు, టేకుమట్ల.*



మంచిర్యాల, మార్చి 11(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని ఇందారం, టేకుమట్ల గ్రామాల్లో సాగు నీరందక వందల ఎకరాల్లో పంటలు ఎండిపోయే దుస్థితి నెలకున్నది. చెరువులు ఎండిపోయి, బోర్లలో నీరు లేక వరి సాగు చేసిన రైతులు అవస్థలు పడుతున్నారు. ఇందారం పక్కప ఉన్న రామారావుపేట పెద్ద చెరువులో నీరు అడుగంటిపోవడంతో ఇందారం, రామారావుపేట గ్రామాల్లో చెరువు కింద సాగయ్యే పొలాలకు నీరు అందడం లేదు. పొలాల్లో నీరు కనిపిస్తున్న చెరువు నుంచి వచ్చే కాలువలో నీటి ఫ్లోటింగ్ లేదు. దీంతో వరి పైరు ఎండిపోవడం మొదలైంది. దాదాపు నెలన్నర రోజులు చెరువు నుంచి నీరు వచ్చిందని గడిచిన వారం, పది రోజులుగా నీరు రాక పంట తడవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పక్కనే గోదావరి ఉన్న అందులోనూ నీళ్లు లేవని రెండేళ్ల క్రితం గోదావరి నిండుకుండలా ఉండి, మా చెరువులో నీరు ఉండడంతో రెండు పంటలకు ఢోకా లేకుండా సాగు చేసుకునే వారిమని రైతులు అంటున్నారు. రామారావుపేట పెద్ద చెరువు కింద దాదాపు 350 ఎకరాల్లో వరి సాగు చేయగా చెరువులో నీరు లేక ఎండిపోవడం మొదలైంది. మరో నెల రోజులపాటు నీరు సరఫరా చేయకపోతే పంట మొత్తం ఎండిపోవడం ఖాయమని రైతులు చెప్తున్నారు. వారం, పది రోజుల్లో భూములన్నీ నెర్రలువారి పొట్ట దశకు వచ్చిన పంట ఎండిపోక తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అటు గోదావరి, ఇటు చెరువుల్లో నీరు లేక మండలంలో టేకుమట్ల గ్రామంలో బోర్ల కింద సాగు చేసే వరి పంటలకు నీరు అందడం లేదు. భూగర్భ జలాలు అడుగంటి పోయాయని, గంట సేపు బోరు నడిస్తే మరో గంట సేపు ఆపేయాల్సి వస్తుందని రైతులు చెప్తున్నారు. ఇచ్చే 18 గంటల కరెంట్‌లో ఏడు, ఎనిమిది గంటలు బోరు నడిపినా.. పంట మొత్తం తడవడం లేదని వాపోతున్నారు. పైపులు మార్చుకుంటూ, అటూ ఇటూ తిప్పుకుంటూ కావలి కాసి నీరు అందిస్తే ఎకరం తడవడానికి రెండు రోజుల సమయం పడుతుందంటున్నారు. ఇప్పటికైనా సర్కారు స్పందించి మా పంటలు ఎండిపోకుండా నీరు అందించాలని, లేనిపక్షంలో పంట ఎండిపోయిన రైతులు ఎకరానికి రూ.30 వేల చొప్పున నష్టపోక తప్పదని తమ కష్టాలను చెప్పుకుంటున్నారు.

నీరు లేక ఎండిపోతున్న ఇందారం సమీపంలో రామారావుపేట పెద్ద చెరువు



### ఖర్చులు కూడా ఎల్లేట్టు లేవ్..

రామరావుపేట పెద్ద చెరువు కింద ఇందారం శివారు లో ఐదెకరాల వరి వేశా. పంట వేసి రెండు నెలలు అవుతున్నది. యాసంగి సాగు మొదలుపెట్టేప్పుడు చెరువు నిండుగా నీరు ఉండే. పక్కను న్న గోదావరిలో నీళ్లు లేక భూగర్భ జలాలు అడుగంటి చెరువు ఎండి పోవటానికి వచ్చింది. దీంతో నీరు పార కానికి సరిపోక పొలం ఎండిపోయే దశలో ఉంది. ఇప్పటికే ఎకరం దాకా నెర్రెలు పారింది. ఐదెకరాలు వేసంగిలో నాట్లు వేయడానికి రూ.1.25 లక్షల వరకు ఖర్చు వచ్చింది. పంట పండుతుందన్న ఆశ లేదు. ఖర్చులు కూడా ఎళ్లని పరిస్థితి ఉంది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

*- గడ్డం సందీప్, యువరైతు, ఇందారం.*



# గ్రూప్-2లో జిల్లావాసుల సత్తా



బుద్దేవార్ ముఖేష్



బిట్లింగ్ ఉదయ్



సాయికృష్ణ



చింతలపెల్లి ప్రీతంరెడ్డి

ఇచ్చోడ(బజార్‌హత్నూర్), మార్చి 11 ః ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలోని కొల్హారి గ్రామానికి చెందిన బుద్దేవార్ నర్సింలు-రాధ దంపతుల కుమారుడు ముఖేశ్ 418 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గ్రూప్-2 ఉద్యోగం సాధించాడు. అలాగే బజార్‌హత్నూర్ గ్రామానికి చెందిన బిట్లింగ్ లక్ష్మణ్-నీల దంపతుల కుమారుడు ఉదయ్ 404 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 51వ ర్యాంకు సాధించాడు. ముఖేశ్ పదో తరగతి వరకు సొనాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇంటర్ బాసరలోని ట్రిపుల్ ఐటీ, డిగ్రీని హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో పూర్తి చేశాడు. డిగ్రీ పూర్తి అయిన తర్వాత పంచాయతీ కార్యదర్శి, గ్రూప్-4 జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాల నోటిఫికేషన్ వెలువడ్డాయి. 2019లో పంచాయతీ కార్యదర్శి, 2021లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలు సాధించాడు. ఆసిఫాబాద్‌లోని ఇరిగేషన్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ గ్రూప్-2కు సన్నద్ధమయ్యాడు. మంగళవారం వెలువడిన గ్రూప్-2 ఫలితాల్లో రాష్ట్రంలోనే 15వ ర్యాంకు సాధించాడు. తన మొదటి ప్రయత్నంలోనే మూడు ఉద్యోగాలు సాధించాడు. అలాగే పంచాయతీ కార్యదర్శి, ఫారెస్ట్ బీట్ అధికారి, వీఆర్‌వో, గ్రూప్-4, సింగరేణి (ఎస్‌సీసీఎల్) జాబ్‌లు సంపాదించి మరోపక్క గ్రూప్-2కు సన్నద్ధమయ్యాడు. గ్రూప్-2 ఉద్యోగం సాధించడంపై అభ్యర్థుల తల్లితండ్రులు, మండల వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

#### బీరవెల్లికి చెందిన సాయికృష్ణ

సారంగాపూర్, మార్చి 11 : బీరవెల్లి గ్రామానికి చెందిన సాయికృష్ణ మంగళవారం ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్-2 ఫలితాల్లో సత్తాచాడు. నర్సన్న-సురేఖ దంపతుల కుమారుడు సాయికృష్ణ ఒకటో తరగతి నుంచి రెండో తరగతి వరకు బీరవెల్లి, మూడు నుంచి పదో తరగతి వరకు ఆర్మూర్ పాఠశాల, ఇంటర్మీడియట్ శ్రీచైతన్య కాలేజీలో విద్యను అభ్యసించాడు. బీటెక్ ఉన్నత విద్యను న్యూ ఢిల్లీలో పూర్తి చేశాడు. గ్రూప్-2 పరీక్షకు సన్నద్ధమైన 188 ర్యాంక్ సాధించాడు. గ్రూప్-2 ఫలితాల్లో సత్తచాటిన సాయికృష్ణను తాజా మాజీ సర్పంచ్ ఇప్ప రవీంద్రనాథ్‌రెడ్డి, ఎంపీటీసీలయ సాగర్‌రెడ్డి అభినందించారు.

#### కజ్జర్లకు చెందిన ప్రీతంరెడ్డి

తలమడుగు, మార్చి 11 : కజ్జర్లకు చెందిన చింతలపెల్లి వెంకట్‌రెడ్డి-అనిత దంపతులు కుమారుడు ప్రీతంరెడ్డి మంగళవారం విడుదలైన గ్రూప్-2 ఫలితాల్లో 431మార్కులతో రాష్ట్ర స్థాయిలో ఐదో ర్యాంకు సాధించారు. ప్రీతం రెడ్డి రవాణా శాఖలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయనను బంధువులు, గ్రామస్తులు అభినందించారు.

# ఎయిర్‌పోర్టు ఫైల్ విషయంలో ఎంపీ నగేశ్ ప్రమాణం చేయాలి

- మాజీ మంత్రి జోగు రామన్న సవాల్
- సీసీఐ ప్రారంభం విషయంలో ఎంపీ, ఎమ్మెల్యేలు స్పందించాలి
- ప్రైవేటుకు అప్పచెబితే రాజీనామా చేస్తామని ప్రకటన చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, మార్చి 11(నమస్తే తెలంగాణ) : మంచి నాయకునిగా పేరున్న ఆదిలాబాద్ ఎంపీ నగేశ్ ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో దోస్తానా చేసి దొంగగా మారాడని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు ఆదిలాబాద్ ఎయిర్ పోర్టు విషయంలో సీఎం కార్యాలయంలో ఫైల్ ఉందని క్లియరెన్స్ విషయంలో మాట్లాడుతామంటే తాను వద్దని అన్నట్లు ఇటీవల ఎంపీ ప్రకటన చేయడం ఆయన అబద్ధాల నాయకుడిగా మారాడనడానికి నిదర్శనమన్నారు. ఎయిర్‌పోర్టుకు సంబంధించిన ఎలాంటి ఫైల్ సీఎం కార్యాలయంలో లేదని అన్నారు. ఈ విషయం చెప్పినట్లు ఎంపీ నగేశ్ ఆయన సొంత గ్రామం జాతర్ల శివాలయంలో ప్రమాణం చేస్తే తాను దేనికైనా సిద్ధమని సవాల్ చేశారు. ఎంపీ అన్న మాటలకు కట్టుబడి ప్రమాణం చేయాలన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలు అబద్ధాలు అడుతూ ప్రజలను పక్కదాని పట్టించవద్దని సూచించారు. ఎయిర్‌ఫోర్స్ ఏర్పాటులో భాగంగా ప్రస్తుతం 369 ఎకరాల స్థలం ఉందని, బీఆర్ఎస్ ప్రభుత్వం 1500 ఎకరాల స్థలాన్ని గుర్తించి నివేదికలు తయారు చేసినట్లు తెలిపారు. ఫీసీబీటీలో భాగంగా రాష్ట్రంలో ఆరు ఎయిర్‌పోర్టులకు రూ.4 కోట్ల వ్యయం చేసినట్లు చెప్పారు. ఎయిర్‌పోర్టు ఏర్పాటు అంశం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో లేదని, 11 సంవత్సరాలు అధికారంలో కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలో ఉందని, జిల్లా బీజేపీ నాయకుల చేతకాని తనం వల్ల ఎయిర్ పోర్టు రావడం లేదన్నారు. గతంలో కిషన్ రెడ్డి లేఖ రాశారని ఎమ్మెల్యే పాయల్ శంకర్ తప్పుడు ప్రకటన చేసినట్లు పేర్కొన్నారు.

#### సీసీఐ విక్రయిస్తే రాజీనామా చేస్తామని ప్రకటించాలి

ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమ విషయంలో ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లు తమ వైఖరి వెల్లడించాలన్నారు. ఆరు వేల మందికి ఉపాధి కల్పించే సీసీఐ విషయంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరిశ్రమ సామగ్రిని తుక్కు కింద విక్రయిస్తున్నారని, సీసీఐ ప్రారంభిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రకటించినట్లు గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి సీసీఐని ప్రారంభించేలా ఎంపీ, ఎమ్మెల్యేలు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో తాము రాజీనామా చేస్తామని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2009లో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అసెంబ్లీలో సీసీఐని ప్రారంభించాలని అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి కన్నా లక్ష్మి నారాయణను కోరినట్లు తెలిపారు. పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో రూ.4500 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తే బీజేపీ నాయకులు తాను ఏమీ చేయనట్లు అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు విజ్జిగిరి నారాయణ, అజయ్, కుమ్ర రాజు, మెట్టు ప్రహ్లాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.